

# జారిన కాళ్లు

రచన:
దాసరి సుబ్రహ్మణ్యం

ఎడంకాలిపాదం బావి వరమీద బలంగా ఆనించి, కుడిచేతులోవున్న బొక్కెనలోని నీళ్లను సలసలకాగి పొగలు కక్కుతున్న కాగులో పోస్తూ, ఎడంచేత్తో పైటను విసురుగా తొలగించి, రవికముడి విప్పుతూ యాదాలాపంగా రుక్మిణమ్మ పక్క డాబామీదికి దృష్టి సారించింది.

ఆశ్చర్యంతో, భయంతో, సిగ్గుతో, అవమానంతో ఆమెకళ్లు త్రుటిలో మూసుకుపోయినై; గుండె తీవ్రాతితీవ్రంగా కొట్టుకున్నది. నేలమీద గాలికి దొల్లాడుతూన్న పమిటని రెండు చేతుల్తో నిండుగా రొమ్ముల మీదికి తీసుకుని ఒక్క అంగలో రుక్మిణమ్మ యింటివసారాలో జొరబడింది.

"ఏంవొదినా! ఏంజరిగింది ?" అన్న వియ్యపురాలి మాటలుగాని, "పీట తెస్తున్నా, కింద కూర్చోకండి!" అన్న కోడలి మాటలుగాని ఆమె చెవుల్లో జొరబడలేకపోయినై. వగరుస్తూ, పైటని మరీనిండుగా గడ్డం కిందనుంచి వొళ్లంతా కప్పుకుంటూ రుక్మిణమ్మ అక్కడే— నేలమీద జేర్లబడిపోయింది.

"ఏంవొదినా! ఏలావుందివొంట్లో?" అంటూ వియ్యపురాలు వెండిగ్లాసు నిండుగా మంచినీళ్లు తెచ్చియిస్తూ భుజం మీద చేయివేసి అడిగినప్పుడు కూడా రుక్మిణమ్మ జవాబు చెప్పలేదు. గ్లాసుడు నీళ్లనీ ఓగుక్కలో తాగి, ఖాళీగ్లాసును తులశమ్మకు అందించి, ఆమె నిస్సారంగా ఓమారు ఎదుటిగోడకు వేలాడుతూన్న పటాలవంక చూసి, నీరసంగా కళ్ళుమూసుకుంది.

ఆదుర్దా, విచారంకలిసిన గొంతుల్తో వియ్యపురాలు తులశమ్మా, కోడలు కాంతం అడిగే ప్రశ్నలకు రుక్మిణమ్మ చేత్తోనే అన్నిజవాబులూ యిచ్చింది. తను బతికినంత వరకూ, అవమానంతో, సిగ్గుతో కుంగిపోవలసినంత దుష్కార్యం యిట్టే, ఏదేవత దయవల్లనో తప్పిపోయి

నందుకు ఆమె లోలోనే కృతజ్ఞతా వచనాలు గొణిగింది.

“అయితే వొదినా! మీరుస్నానాలు ఎక్కడ చేస్తూంటారు?” రుక్మిణమ్మ ఆయాసంగా అడిగింది.

తులశమ్మకు ఆప్రశ్న, ఆస్థితిలో అసందర్భంగా తోచింది. అయినా రెండు సంవత్సరాల బాంధవ్యంద్వారా కలిగిన అనుభవంతో, ఆమెకు వియ్యపురాళ్ల ప్రశ్నలకు సందర్భాలంటూ వుండవని తెలుసు. అందుకే కొంత కుదుటపడిన హృదయంతో ఆమె మామూలుగానే జవాబిచ్చింది.

“లోగడ బావిదగ్గరే స్నానాలు చేసేవాళ్లం. యీమధ్యనే అందుకోసం వేరే గదికట్టించాం.”

రుక్మిణమ్మ మరేమీ ప్రశ్నించలేదు. ఆమెలో అసంఖ్యాకంగా ప్రశ్నలు కదల్లాడినై ‘డాబామీదనుంచి తనను చూసిన ఆ కుర్రాడెవరు?’ ‘ఎన్ని రోజుల్నుంచిఅక్కడుంటున్నాడు?’ ‘లోగడ తనకోడలు కాంతం బావిదగ్గిరే స్నానం చేస్తూండేదా?’ యిలాటివే అనేక ప్రశ్నలు ఆమెను వుక్కిరిబిక్కిరి చేసినై. అందుకే ఏప్రశ్నా అడగలేక రుక్మిణమ్మ మరోగ్లాసు మంచినీళ్ళు మాత్రం అడిగి వూరుకుంది.

గంట తరవాత స్నానాలగది తలుపు గడివేసుకున్నప్పుడు కూడా రవికే, చీరా విప్పేందుకు రుక్మిణమ్మ సంశయించింది. గోడకు కంతలు లేవనీ, తలుపు ఒకేచక్కతో చేయబడిందనీ, ఒకటికి రెండుమార్లు జాగర్తగా చూసి నిశ్చయించుకున్న తరవాత; ఆమె భయం భయంగానే, వివస్త్ర కాగలిగింది.

స్నానం చేస్తున్నంతసేపూ రుక్మిణమ్మ అందరు దేవతలకూ, దేవుళ్ళకూ కృతజ్ఞతాభివందనాలు చేస్తూనేవుంది. తనే ఆనిమిషంలో అలాపైకి చూడకపోతే ఎంత ఘోరం, అవమానం జరిగిపోయేది! వూహ తెలిసి నప్పటినుంచీ యీనాటి వరకూ, తన భర్తవొక్కడికితప్ప. మరే పురుషుడికంటా పడకుండా కాపాడుకొస్తున్న తన నగ్నదేహం, నిండువెలుగులో ఆకుర్రాడికంట బడిపోయేది. ఆతరవాత తన పాతివ్రత్యం, పవిత్రతా బుగ్గిఐపోక ఎలానిలవగలిగేవి!

తను రవికముడి విప్పబోతూ, డాబా మీదికి దృష్టి సారించినప్పుడు, ఆకుర్రాడు అక్కడే నదురూబెదురూ లేకండా, తదేకధ్యానంగా తన వేపు చూస్తున్నాడు. తను చూసినప్పుడైనా అక్కడినుంచి కదలలేదు. అలా చూడడం అతడికి అలవాటేనేమో! అయితే తన కోడలు కాంతం...!

రుక్మిణమ్మ తలగిర్రున తిరిగింది. కళ్ళు మైకం కప్పుకుని, స్నానాల గదంతా నల్లని చీకటిమయమై పోయింది. ఏదో ఆవేశించిన దానిలా ఆమె కౌగులోని నీళ్ళను ఒకేమారుగా మీద గుమ్మరించుకుని, చీరతో వొళ్ళు తుడుచుకుని, చాలీచాలని పంచ వొంటికి చుట్టుకుని వణుకుతూ గదినుంచి బయటపడింది.

అంత ఆదుర్దాగా బావిదగ్గరనుంచి వసారాలోకి పరుగెత్తుకొచ్చి, అలా నేలకు చేర్లాపడిపోయిన కారణం తులశమ్మ ఎన్నిసార్లడిగినా, రుక్మిణమ్మ సరైన జవాబివ్వలేదు. ఆమె హృదయంలో అనేక అనుమానాలూ, ప్రశ్నలూ; తనే తులశమ్మను అడిగి తెలుసుకోవలసినవి నానా యాతనా పెడుతున్నవి.

సహించదని తెలిసినా, వియ్యపురాలి బలవంతంవల్ల ఆమె విస్తరిముందు కూర్చోక తప్పలేదు. తలవంచుకుని అన్నంలో కూర కలుపుతూ రుక్మిణమ్మ విదాయ నిమిషాలు అలాగే వుండిపోయింది. హృదయంలో గుబురుగా ముసురుకుపోతూన్న ప్రశ్నల్ని వేరు పరిచేందుకు మనస్సు ప్రయత్నిస్తూంటే, వేళ్లు అన్నంలోని వడ్లగింజల్ని వేరు పరిచేందుకు పనిచేస్తున్నయ్.

తలుపు నానుకుని అత్త వాలకాన్ని పరీక్షగా చూస్తున్న కాంతం, వంటగది గడప పక్కన కూర్చున్న తల్లి వేపుకు తలతిప్పి చూసింది. తల్లీకూతుళ్ళ కళ్లు కలుసుకుని త్రుటిలో ఓనిర్ణయానికి వచ్చినై. తులశమ్మ గడపమీద పడివున్న వట్టివేళ్ళ విసనకర్రను చేతిలోకి తీసుకుని, రుక్మిణమ్మను పరీక్షగా చూస్తూ ఆమెపక్కన కూర్చుంది.

“ఏంవొదినా! వొంట్లో బావోలేదా?”

ప్రశ్నలతో, అనుమానాలతో సతమతమౌతున్న రుక్మిణమ్మను, వియ్యపురాలి మాటలు తృళ్ళిపడేట్లు చేసినై. ఆమె విస్తరి మీదనుంచి దృష్టిని తులశమ్మ మీదకు ఓక్షణం సారించి, తలుపు నానుకుని నిలుచున్న కోడలివంక తీక్షణంగా చూసి, “ఉహుఁ! హుఁ!” అని నసిగి మళ్ళీ తలవంచుకుంది.

“అన్నయ్యగారుకూడా వస్తే బావుండేది. అక్కడ హోటల్లో తిండి...”

మూగగా అంత నేపణ్నించీ వూరుకోవడం, హాస్యాస్పదంగా కనబడి, మాట్లాడేందుకు మాటలకోసం తడువుకొంటూన్న రుక్మిణమ్మకి, వియ్యపురాలి మాటలు మంచి అవకాశాన్నిచ్చినయ్. చప్పున మాటలు గొంతునుంచి బయటికి దొర్లినై.

“అదేవొదినా ... అదే అనుకుంటున్నాను! హోటల్లో తిండి వారికి సరిపడదు. వచ్చి పూటైనా కాలేదు— అప్పుడే యింటిమీదికి ఘాలిమళ్లుతోంది. మీఅన్నయ్యగారికి హోటలుతిండి ఏమీ పడదు.”

తులశమ్మ, కూతురువంక పక్కచూపు చూసింది. కాంతం చిన్నగానవ్వి తలుపు నానుకుని కూర్చుంది.

“అవును గాని వొదినా...”

“ఆఁ!”

మళ్ళీ రుక్మిణమ్మకు మాట పెగలలేదు. ఏమడిగితే, ఏమర్థంచేసుకుంటారో అని ఆమెకు సంశయంగానే వుంది. మరో నిమిషం విసట్లో దృష్టి నిలిపి, గుండెను దిటవు చేసుకుని అడిగింది.

“డాబామీద ఎవరో అద్దెకుంటున్నారల్లే వుంది!”

"అవును వొదినా! అద్దెకిచ్చాను. ఎంతోమందిలేరు. ఒక్కడే!"

రుక్మిణమ్మ దృష్టిని విస్తరిమీదినుంచి, వియ్యపురాలి మొహంమీదికి తిప్పింది.

"భార్య, పిల్లలూ లేరా?"

"లేరు వొదినా. వొంటరిగానే వుంటాడు. చాలామంచివాడు. తాలూకా ఆఫీసులో వుద్యోగం."

రుక్మిణమ్మకు గొంతు పిసికినట్లయింది. తిన్న నాలుగు మెతుకులూ బయట పడేందుకు ప్రయత్నిస్తూన్నట్లు తోచింది, తను అనుమానించింది యదార్థంలా తోచింది—

వెండి గ్లాసులోంచి ఓ గుక్కెడు మంచి నీళ్ళు తాగి, రుక్మిణమ్మ కీచు గొంతుతో అన్నది.

"ఏదైనా... కాపరాలుండే యిళ్ళ మధ్య...అలా వొంటరిగా వుండే కుర్రాళ్ళు ......" ఆపైన ఆమె మాటలు మరీ కీచుమన్నయ్.

తులశమ్మ గతుక్కుమన్నది. అయినా యిలాంటిమాటలు చాలామంది లోగడ అన్నప్పుడు, తను చాలాసార్లు యిచ్చిన జవాబు ఆమెకు బాగాగుర్తే-

"అలాంటి కుర్రాడు కాదువొదినా! ఆడవాళ్ళు ఎదురైతే తలవంచుకు పోతాడు."

"ఆఁ !" రుక్మిణమ్మ అలాగే నోరు తెరిచి, గుండ్రని పెద్దకళ్లతో తులశమ్మ కళ్లలోకి చూస్తూ వుండిపోయింది. ఏదో పెద్ద తప్పుమాట అన్నదానిలా భయపడిపోయి తులశమ్మ విసనికర్ర చాటున తలదాచుకుంది.

రుక్మిణమ్మకు అనుమానాలన్నీ పటాపంచలై, పలకలు తేలిన బరువైనసత్యం హృదయంలో భారంగా కదులాడింది. పురాణాల్లోని పతివ్రతల్నీ, నోముల్నీ, పూజల్నీ అపహాస్యం చేస్తూండే కోడలి స్వభావం; తను యింతకాలంనుంచి అనుమానిస్తున్నట్టే — అపవిత్రమైందని ఆమెకు తోచింది.

ఆరాత్రి రుక్మిణమ్మకు నిద్రపట్టలేదు. అత్తవారింటి తరఫు మరణించిన పతివ్రతలూ, పుట్టింటితరఫు పతివ్రతలూ, దోమతెర అవతల గుంపుగా చేరి, ఆమె, తమకీర్తి ప్రతిష్ఠల్ని మంటకలిపే గుణవతిని, కోడలుగా స్వీకరించినందుకు నానామాటలూఅని, నానా విధాలుగా మెటికలు విరిచారు.

"అమృతంలాంటి వంశంలో, విషసర్పం ప్రవేశించింది."

రుక్మిణమ్మ ఆ వాక్యాలని, కలత నిద్రలో చాలాసార్లు కలవరించింది. నిర్భయంగా తను రవికె ముడివిప్పటాన్ని, వొళ్లంతా కళ్లుచేసుకుని చూస్తున్న ఆ డాబామీది కుర్రాణ్ణి, వియ్యపురాలు స్త్రీలు ఎదురైతే తలవంచుకుపోతాడంటూ చెప్పడం, ఎంత పచ్చి అబద్ధమో ఆమె వూహించుకుని, అసహ్యంతో, కోపంతో వికారపడింది.

'బహుశా తల్లీ - కూతుళ్లు కలిసే నాటకమాడుతూండాలి. నేను కాప

రానికి వెళ్లిన ఐదు సంవత్సరాలకిగాని గర్భం ధరించలేదు. మా అత్త ఎనిమిదేళ్ళ కాపరం తరవాత మా ఆయన్ని కన్నది. మా అత్తగారి అత్త పదేళ్ళకి... మరి యీ కాంతం... పెళ్లయిన ఏడాదికే గర్భవతిఐంది!'

మంచానికున్న దోమతెరని బాగా తొలిగించి, కాళ్ళను కిందకు వేలాడేసి, రెండు చేతుల్లో తలను వడిసి పట్టుకుని రుక్మిణమ్మ అదే భావాల్ని మళ్లీ మళ్లీ మననంచేసింది; చాలా సేపటికి నీరసంగా నడుంవాల్చింది.

కుడికాలును మంచం పట్టెమీంచి కిందకు వేళ్లాడేసి, ఎడంకాలును తలగడమీద పెట్టి, తల కాళ్లకట్టవైపుకు పెట్టి, కలతనిద్దరలో పలవరిస్తూండగా, బాగా బారెడు పొద్దెక్కిన తరవాత కాంతం అత్తగారిని భుజం తట్టి నిదర లేపింది. రుక్మిణమ్మ కళ్లు తెరుస్తూనే ఎదురుగావున్న కోడల్నిచూసి కళవెళ పడి - క్రోధం ముప్పిరిగొన్న కళ్లతో ఓమారు మొహంలోకి చూసి, మరో ప్రక్కకు తిరిగి పడుకున్నది.

“ఏం అత్తయ్యా! వొంట్లో బావో లేదా?”

రుక్మిణమ్మ ఏ జవాబూ చెప్పలేదు. యీ ‘వొంట్లో బావోలేదా?’ అన్న ప్రశ్న కిందటిదినంనుంచి తనను మళ్లీ మళ్లీ అడుగుతూనే వున్నారు. నిజంగా తనకు వొంట్లో బావో లేదా ?

రుక్మిణమ్మ తలగడను కాలితో ఓ తన్ను తన్ని చప్పున లేచి కూర్చుంది.

పవిత్రమైన వంశం యీ సరికే అపవిత్రమైపోయింది. మరో మూడు నెలలకు దాని ప్రత్యక్షచిహ్నంగా, తన కోడలు కాంతం ఓ జీవిని యీలోకంలోకి తెస్తుంది.

విపరీతమైన తలనొప్పితో ఆమె గిజ గిజ కొట్టుకున్నది. కలలో కనబడినట్టూ, చీకట్లో కదులాడినట్టూ - నిదర లేక ఎర్రబడ్డ ఆమె కళ్లముందు అనేక భయంకరదృశ్యాలు కదులాడినై. జుగుప్సతో, భయంతో; ముడుచుకుపోతున్న హృదయంతో, మూసుకుపోతున్న కళ్లతో రుక్మిణమ్మ వసారాలోకి వచ్చి గుంజకు చేరబడి కూర్చుంది.

పనిమనిషికి అంట్లుతోమే పని పురమాయిస్తున్న తులశమ్మ, వియ్యపురాల్ని చూసి అన్నది-

“ఏంవొదినా! రాత్రి బాగా నిదర పట్టలేదల్లేవుంది!”

రుక్మిణమ్మకు జవాబిచ్చేందుకు మనస్కరించకపోయినా మర్యాదకోసం బలవంతంగా మాటలు పెగుల్చుకుని, తడబడుతూ అన్నది.

“నిదర సరిగా పట్టలేదు. అన్నీ పీడ కలలు!”

తులశమ్మ మరి మాట్లాడలేదు. పనిలో నిమగ్నురాలైపోయింది. తనను తల్లీ-కూతుళ్లిద్దరూ అదోలాచూస్తున్నట్టు రుక్మిణమ్మ అనుకుంది. బహుశా తనకు వొంట్లో బావోలేదని వాళ్లు వూహిస్తూండాలి. అసలు సంగతి వాళ్లకేం తెలుసు! ఆ కుర్రాడికీ వీళ్లకీ-ముఖ్యంగా

తన తోడలికి వున్న సంబంధమేమిటో ఖచ్చితంగా తెలుసుకుంటేనే గాని, తన మనస్సుకు శాంతివుండదని ఆమె నిర్ణయించుకున్నది. అనుమానాల్తో తనెందుకు బాధపడాలి?

"ఆ కుర్రాడు అద్దె సరీగా యిస్తూంటాడా?" కాలి వేళ్ళతో నేలనురాస్తూ, తలవంచుకునే రుక్మిణమ్మ ప్రశ్నించింది.

"అద్దె ఒక్క రోజైనా ఆలశ్యం కాకుండా యిస్తూంటాడు. చాలా నిదానస్తుడూ, మంచివాడూ."

రుక్మిణమ్మకు కణతలు చిటపటలాడినై. ఆ కుర్రాడి మంచితనమేదో తనకు తెలుసు! ఆమెలో వుక్రోషం పరవళ్ళు తీసింది. వద్దనుకుంటూనే, ఆవేశంపట్టలేక కోపంగా అన్నది.

"ఆకుర్రాడు అంతమంచివాడంటూ నువ్వు చెపుతున్నావు వొదినా! కాని నిన్న ఏం జరిగిందో తెలుసా?"

"ఆఁ!" తులశమ్మ ఆశ్చర్యంతో నిశ్చేష్టురాలైంది.

"స్నానాలగదివున్న సంగతి తెలీక, బావిదగ్గిర స్నానంచేద్దామనుకుని రవికె విప్పుతూ పైకిచూద్దునుగదా — డాబా మీద నన్నుపరీక్షగాచూస్తూ ఆకుర్రాడు నిలబడివున్నాడు. నేను చూసిన తరవాతైనా అక్కడనుంచి కదలలేదు."

"నిజంగా నా వొదినా?"

"అబద్ధం చెప్పాలిసిన ఖర్మ నాకేం పట్టె! అతడి మొహాక్క ముఖంకూడా ఎరగను."

తులశమ్మ చాలా నొచ్చుకుంది. అయితే నిన్నటినుంచీ వియ్యపురాలు యీ సంగతి చెప్పకుండా ఎందుకు దాచినట్టు? ఆకుర్రాడు ఏదో ఆలోచించుకుంటూ, ఎటో చూస్తుంటే — తననే చూస్తున్నాడని పొరబడివుంటుంది!

"కాని వొదినా! ఆకుర్రాడు ఏడెనిమిది నెల్లనుంచివుంటున్నాడు. యీనాటి వరకూ అలాంటి తరహా ఏమీ కనబడలేదు. నన్ను 'అక్కయ్యా' అంటూ ఎంతో ఆప్యాయంగా పిలుస్తాడు. యిప్పటివరకూ అతణ్ని గురించి ఎవ్వరూ చెడ్డగా చెప్పలేదు."

తులశమ్మమాటలు రుక్మిణమ్మకి కర్ణకఠోరంగాతోచినై. ఏదో ఆలోచిస్తూ నిలబడివుండి వుంటాడనటం చాలా హాస్యాస్పదంగా కనబడింది. పైగా అక్కయ్యా అని పిలవడం ... అప్పుడు శాంతం ఏమవుతుంది? ఇంతకీ తులశమ్మకి ఆకుర్రాడి మంచితనంమీద తగని విశ్వాసంవున్నట్టు రుక్మిణమ్మకు ధృడపడిపోయింది. తనే ప్రయత్నించి అతడినీచప్రవర్తనని వియ్యపురాలికంట బడేట్టు చేస్తే—మరి శాంతం...

రుక్మిణమ్మ తాపీగా అన్ని కోణాల నుంచీ ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. నిన్నటివేళకే వేడినీళ్ళ కాగును భావిదగ్గిర పెట్టి, బొక్కెనతో చన్నీళ్ళు పోస్తూ రవికెముడి సవరించి తలపైకెత్తి డాబామీదికి దృష్టిబరిపింది—

అక్కడే - నిన్నటిలానే ఆకుర్రాడు నిలబడి తనవైపు చూడడం ఆమెకంట

బడింది. ఆమె మనస్సు చివుక్కుమన్నది. హఠాత్తుగా సిగ్గు దొంతరలు ఆమెమీదికి దొర్లి తలవంచుకునేట్లు చేసినై.

బొక్కెన అక్కడే పడేసి ఆమె గబగబా యింట్లోకి వెళ్ళి వంటగదిలో కూర్చున్న తులశమ్మతో రహస్యంగా అన్నది.

“అకుర్రాడు అక్కడే — నిన్నటిలానే నిలుచునివున్నాడు.”

తులశమ్మ ఆ మాటవింటూనే లేచి నిలబడింది. ఆమెదృష్టికి యిదంతా ఓ ప్రహసనంలా కనబడింది. వచ్చి నెలైనా గడవకముందే వియ్యపురాలికి ఆ కుర్రాడి విషయంలో యింతపట్టింపు ఎందుకు కలిగినట్టు?

తులశమ్మ బావిదగ్గరకువచ్చి పైకి చూసినప్పుడు, ఆ కుర్రాడు అక్కడే నిలబడివున్నాడు. కళ్ళుమాత్రం దూరంగా ఎక్కడో దేన్నో చూస్తున్నయ్.

తులశమ్మ తిరిగి యింట్లోకి వెళ్ళినప్పుడు రుక్మిణమ్మ వంటగది తలుపు పట్టుకుని ఆలోచిస్తూ నిలబడివుంది—

“వొదినా! అంతా నీ అనుమానం గాని—ఆ కుర్రాడు అలాంటివాడు కాదు. ఏదో ఆలోచిస్తూ—ఎక్కడో చూస్తున్నాడు.”

రుక్మిణమ్మ ఆమెమాటలు వినిపించుకోనట్టే వూరుకుంది. కాని ఆ మాటలు ఆమె హృదయంలో శూలాల్లా తగిలి, మరికొన్ని అనుమానాల్నీ, ఆలోచనల్నీ రేపినై. ‘అమంచితనమేదో నేనే తెలుసుకుంటా!’ యిదీ ఆమెహృదయం మూగగా చేసినప్రతిజ్ఞ.

దృఢనిశ్చయంతో ఆమె బావిదగ్గరకువచ్చింది. కలల్లో, మైకంలో వున్నదానిలా, తన చర్యలఅర్థాన్నీ, ఫలితాల్నీ తెలుసుకోలేని మైమరపులో రుక్మిణమ్మ పైట ఎడంచేత్తో పక్కకునెట్టి, రవికవిప్పుతూ పైకిచూచింది.

ఆమెకళ్ళు జిగేలుమన్నయ్. ఆకుర్రాడు ఆమెవైపుకు చూస్తూండడమేగాక, చిన్నగానవ్వి, బాగా తలపంకించాడు.

రుక్మిణమ్మకు ఎవరో వీపుగట్టిగాతట్టి మొత్తంశరీరాన్ని కదిపి కుదిలించినట్టయింది. ఒక్క అంగలో వసారాలో జారబడి రొప్పుతూ గుంజపట్టుకు నిలబడింది.

“నేనేంచేశాను? నాపాతివ్రత్యం ఏమైనట్టు! తెలిసుండీ, ఓ నీచుడిముందు-అంతహీనంగా...”

ఆమె సన్నగా, హీనస్వరంతో అన్న ఆమాటలు ఎవరూ వినలేదు. కళ్ళవెంట జారిన ఒకటిరెండు నీటిబిందువుల్నీ పైటచెంగుతో తుడుచుకుని, ఆమె అక్కడే విచారిస్తూ కూలబడింది.

ఆ సాయంత్రం ఆరుగంటలకు వియ్యపురాలూ, కోడలూ సినిమాకి వెళ్దామన్నప్పుడు ఆమె తనవొంట్లో బావోలేదని ఖచ్చితంగా చెప్పింది. నిజంగానే రుక్మిణమ్మకు వొంట్లోబావోలేదు. యింత జరిగినతరవాత— తన

కోడలి గర్భానికి కారకులెవరో ఆమెకు తెలిసిపోయినట్టు తోచింది. అయినా ఏదో అనుమానం ఆమెను పీడిస్తూనే వుంది.

తనే ఆవిషయం అక్రూరాణ్ని అడిగితే? బహుశా నిజం చెప్పడు. నిజం చెపితే ఎంతబావుండును! కాంతంవంటి పతితురాలిద్వారా తన కొడుకువంశాన్ని నిలబెట్టడం ఎంత నీచమైన కార్యం! యీ ఖైవేలఆస్తికి వారసుడైన తనకొడుక్కి మరో పెళ్లి కాదనే భయం ఆమెకులేదు.

వియ్యపురాలూ, కోడలూ సినిమాకి వెళ్లగానే, రుక్మిణమ్మ మళ్లీ ఓదృఢనిశ్చయంతో బావిదగ్గరకు వచ్చింది. అక్రూరాడు అక్కడే ఆవైపు కేచూస్తూ నిలబడివున్నాడు. ఆమెకు ఆశ్చర్యం వేసింది. వుద్యోగం అనిచెప్పే మాటలు వట్టిదేనేమో! యిరవై నాలుగు గంటలూ అక్కడ నిలబడి— అలాచూస్తూండడమే అతగాడి వుద్యోగమేమో!

ఆమె బావిదగ్గర బింకంగానిలబడి, మొహంలో ఏభావం ప్రస్ఫుటం కానీకుండానే, ఆ అక్రూరాడివంక చూస్తూ రమ్మన్నట్టు తలవూపింది. అతడు మెల్లిగా నవ్వి, ఒక్కగంతులో దాకాడిగి, దొడ్డివాకిలి నెట్టుకుని, మెరిసేకళ్లతో, నవ్వుతూ రుక్మిణమ్మ ముందు ప్రత్యక్షమయ్యాడు.

అంత సామీప్యంలో అక్రూరాడిని చూడగానే, ఆమెకాళ్లు వణికినై. పాదాలకింద భూమి జరుగుతూన్నట్టు తోచింది. పట్టుదలతో, మానసిక శారీరబలాల్ని కూడగట్టుకుని-

"మరీదగ్గరకు రాబోకు. ఏమీ లేదు- ఒక్కమాట అడుగుదామని పిలిచాను. నిజంచెప్పితే యీ ఆరు నవక్సుల గొలుసు..." ఆమె తడబడింది. అక్రూరాడు కొంచెం పెద్దగానే నవ్వాడు.

"డబ్బు యివ్వడమంటే నాకు అసహ్యం; పుచ్చుకోవడమంటే పరమ అసహ్యం. యిలాంటివాటిల్లో డబ్బు ప్రసక్తే రాకూడదు."

రుక్మిణమ్మ ఆపాదమస్తకం వణికిపోయింది. అతడు నవ్వుతూ, మరీదగ్గిరకి వస్తున్నాడు.

"దగ్గరకు రాబోకు నాయనా! నా వయసు నలభై దాటుతోంది. యీ కాలపువాళ్లలా ఆలరిచిల్లరదాన్ని కాదు. ఓ విషయం అడుగుదామని..."

ఆ అక్రూరాడు రుక్మిణమ్మకు ఓ అడుగు దూరంలోకివచ్చి నిలబడి నవ్వుతూ అన్నాడు-

"నీ వయసు నలభై అంటే ఎవరూ నమ్మరు! యిరవై అయిదు లేకపోతే ముప్ఫై అంతే! ఎంత అందం! యింతకు యిందే ఎందుకు తటపటాయిస్తావు కాంతా?"

రుక్మిణమ్మ కంపించిపోయింది. ఆమె నోటయించి ఎంత ప్రయత్నించినా ఒక్కమాట గానీ, కనీసం కేకబయటా గాని వెలువడలేదు. పశుప్రాతతోగలా అక్రూరాడి బలమైన చేతుల్లో నిస్సహాయంగా వుండిపోయింది.

* * *

"రేపు యీ వేళప్పుడు వీలుండదు. రాత్రి తొమ్మిది గంటలకు దొడ్డివాకిలి

తీస్తావా?" అని ఆ కుర్రాడు చెవులో మెల్లిగా అన్నప్పుడు రుక్మిణమ్మ తన మనస్సుని, కాళ్లూ-చేతుల్నీ తన స్వాధీనంలోకి తెచ్చుకుంది.

ఏంజరిగింది? ఆ జరిగిందేదో అప్పటికి ఆమెకు తెలిసింది. కాని తను అడిగి తెలుసుకుందామనుకున్న అసలు సంగతి!

"కాంతం నాకోడలే! దానితో ఎప్పుడైనా..." ఆ మాటలు రుక్మిణమ్మ మైకంలో వుండి అడగలేదు. అడగాలనే స్పష్టంగా అడిగింది.

ఆ కుర్రాడు నవ్వుతూ వేలితో ఆమె బుగ్గమీద కొట్టి-

"నీ కోడలు చదువుకున్నదే గాని-వర్తిపిచ్చిది! నీలోవున్న చొరవలో పదోవంతువున్నా నేను కాద నేవాణ్ని కాదు. పదహారణాల పాతకాలపు మనిషి!"

రుక్మిణమ్మ ఆ మాటలు వింటూనే వికృతంగా అరిచి, జుట్టు పీక్కొని ఎగిరి కూర్చుని ఆ కుర్రాడిజుట్టు రెండుచేతుల్తో బలంగా పట్టుకున్నది. అతడు భయంతో వెర్రిగా అరుస్తూ, పెనుగులాడి జుట్టు విడిపించుకుని, దొడ్డివాకిలి నుంచి బయటికి పరిగెత్తాడు.

—(o)—

